క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

అడ్డాకుల: మూసాపేటలోని గుట్టపై పురాతన కాలంలో వెలిసిన రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణం కోసం.. నిజాలాపూర్‌నకి చెందిన జాజాల లక్ష్మమ్మ, రాంచంద్రయ్య కుటుంబ సభ్యులు విరాళం ప్రకటించారు. ఆదివారం రూ.21,116 నగదును కృష్ణసాగర్, రమేష్‌సాగర్, సురేష్‌సాగర్‌లు ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ భేష్



నవాబుపేట: ఏకల్ గ్రామోత్సవ్ ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచితంగా ఇస్తున్న టైలరింగ్ శిక్షణ చాలా బాగుందని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో శిక్షకురాలు అరుణ అధ్యతన జరిగిన సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏకల్ సంస్థ దక్షిణ తెలంగాణ ఇన్‌చార్జ్ పోల్కంపల్లి చంద్రశేఖర్, ఉమ్మడి పాలమూర్ జిల్లా కన్వీనర్ రామకృష్ణ, రాజేష్, నర్సింహ, రవి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నిధులతో బోరు ఏర్పాటు



మహమ్మదాబాద్: మొకర్లాబాద్‌లో గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే నిధులతో బోరు వేయించారని.. దీంతో నీటి సమస్య తీరనుందని నాయకులు ఎన్ లక్ష్మయ్య, మైబయ్య ఆదివారం అన్నారు. ఈ మేరకు మోటారును గ్రామస్తులు ఆదివారం ప్రారంభించారు. కాగా బోరు వేయించి సమస్య తీర్చారంటూ నాయకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాల కిష్టయ్య, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బాలానగర్: బీఆర్‌ఎస్ కార్యకర్త సుప్ప పోచయ్య ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలిసిన ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి సోమవారం దినకర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పోచయ్య బీఆర్‌ఎస్‌కు మండల యువత అధ్యక్షుడు సుప్ప ప్రకాష్‌ను అందించారని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ వెంకటచారి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రావు, ఎంపీటీసీ లింగునాయక్, గోపాల్‌రెడ్డి, చెన్నారెడ్డి, సుప్ప రమేష్, గణేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

దేవరకద్ర: పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బాల్‌రాజు చినాన్న డబ్బు ప్రభాకర్ గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్నారు. కాగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. జట్టి నర్సింహా రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, వెంకటేష్, నరేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు ఉన్నారు. పాల్గొన్నారు.

అమ్మవారి చెంత భక్తుల రద్దీ



నవాబుపేట: వేసవి సెలవులు పూర్తవ్వడం దగ్గర పడుతున్న కొద్దీ పర్వతాపూర్ అమ్మవారి ఆలయంలో భక్తుల సందడి పెరుగుతూ వస్తోంది. ఆదివారం సైతం మైసమ్మ ఆలయంలో భక్తులు పెద్దఎత్తున పూజలు చేశారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో అడవి మొత్తం అమ్మవారి నామస్మరణతో మార్మోగింది.

గాలివాన బీభత్సం

భూత్పూర్‌లో నేలకూలిన ధ్వజస్తంభం



భూత్పూర్: మున్సిపాలిటీతోపాటు మండలంలోని వివిధ గ్రామాలల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో వర్షం కురిసింది. పట్టణంలో శ్రీమునిరంగస్వామి దేవాలయం ఎదుట ఉన్న ధ్వజస్తంభం ఈదురు గాలులకు నేలకొరిగింది. కొన్ని చోట్లు విద్యుత్తు స్తంభాలు, చెట్లు పడిపోగా మూడు గంటల పాటు విద్యుత్తు అంతరాయం ఏర్పడింది.



ఇప్పటూర్‌లో ద్విచక్రవాహనంపై పడ్డ చెట్టు



కొల్లూర్‌లో..

నవాబుపేట: మండలపరిధిలో ఆదివారం గాలీవాన బీభత్సం సృష్టించింది. దీంతో ఇప్పటూర్, చౌటపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి రోడ్డుపై పడ్డాయి. విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో పాటు గాలికి రేకుల ఇళ్లు దెబ్బతిన్నాయి. రెండు గ్రామాల్లో దాదాపు 8 మంది ఇళ్లు దెబ్బతినడం గమనార్హం. ఇప్పటూర్‌లో ఎక్కడ చూసినా రోడ్లపై విరిగిపడిన చెట్లు, విద్యుత్‌స్తంభాలే కనిపించాయి. కాగా ఒక ట్రాక్టర్‌తో పాటు రెండు ద్విచక్ర వాహనాలు చెట్లు పడి పూర్తిగా దెబ్బతిన్నాయి. కాగా వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని విద్యుత్ పునరుద్ధరించాలని ఎంపీటీసీ తులసీబాయి, మాజీ సర్పంచ్ అబ్దుల్లాలు సంబంధిత అధికారులను కోరారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు అందరూ కలిసి ఇళ్లు, రోడ్లపై పడ్డ చెట్ల తొలగింపు చేపట్టినట్లు వివరించారు.



ఇప్పటూర్‌లో రోడ్డుపై విరిగిపడ్డ స్తంభం



చౌటపల్లి గ్రామంలో దెబ్బతిన్న రేకుల ఇల్లు

బాలానగర్ పరిధిలో..



బాలానగర్: మండల కేంద్రంతోపాటు, తిరుమలగిరి గ్రామం, కేశ్య నాయక్ తండాలో ఈదురుగాలులతో కూడిన గాలివానలతో ముగ్గురు ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. దీంతో కుమార్, తౌర్య నాయక్, బుగ్యనాయక్ కుటుంబాలకు ఆశ్రయం లేకుండా పోయింది. కాగా ప్రభుత్వం సాయం అందించాలని కోరారు.

మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ..



అడ్డాకులలో వర్షం కురుస్తున్న వర్షం

అడ్డాకుల: మూసాపేట, అడ్డాకుల మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పెద్ద ఎత్తున గాలి వీస్తూ వర్షం కురిసింది. మూసాపేట మండలం సంకలమద్దిలో డీలర్ వాసుదేవమ్మకు చెందిన ఇంటిపై రేకులు ఎగిరి పోయాయి. ఇతర గ్రామాల్లో పెద్ద, పెద్ద వృక్షాలు నేలకొరిగాయి. పంట పొలాల్లో వర్షంతో నీళ్లు నిలిచాయి. గత రెండు, మూడు రోజులుగా సాయంత్రం వేళ వర్షం కురవడంతో పాటు ఈదురు గాలులతో నష్టం వాటిల్లుతోంది.



సంకలమద్దిలో రేకులు ఎగిరిపోయిన వాసుదేవమ్మ ఇల్లు

హన్వాడ పరిధిలో..



గొండ్యాల్‌లో ఇంటిపై కూలిన భారీ వృక్షం

హన్వాడ: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షానికి పలు చోట్ల వృక్షాలు నేలకూలాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. వేపూర్ వైపు వెళ్లే రహదారికి అడ్డంగా ఓ వృక్షం కొమ్మ విరిగిపడడంతో అటువైపు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా గొండ్యాల్‌లోని మాదిగి చెన్నప్ప ఇంటిపై సమీపంలోని పోచమ్మ ఆలయం వద్ద ఉన్న ఓ భారీ వృక్షం కూలింది. ఆసమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కొత్తపేటలో నాగయ్య అనే వ్యక్తి కిరాణా డబ్బా లేచిపోయి వందమీటర్ల దూరంలో పడింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



హన్వాడ నుంచి వేపూర్ వేళ్లే దారికి అడ్డంగా పడిన చెట్టు

నేడు విద్యుత్ అంతరాయం

దేవరకద్ర: మరికల్ 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దేవరకద్ర, గోపన్‌పల్లి, నాగారం, బస్వాయపల్లి 11 కేవీ సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాలకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరాఫరా ఉండదని ఏఈ సత్యయ్య తెలిపారు. ప్రజలు ఈ విషయం గమనించి సహకరించాలని కోరారు.

సన్మానం



చిన్నచింతకుంట: చిన్నవడ్డేమాన్‌కి చెందిన రాజేందర్ కొన్ని రోజుల క్రితం రవీంద్ర భారతిలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ అవార్డును సినీహీరో సుమన్ చేతుల మీదుగా అందుకున్నాడు. ఈ మేరకు ఆదివారం గ్రామంలోని చర్చిలో స్థానికులు వారిని సన్మానించారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



మహమ్మదాబాద్: చౌదర్‌పల్లికి చెందిన తిరుమలయ్య 20 రోజుల కిత్రం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ నేపథ్యంలో అతడితో పాటు (1994–95 పదోతరగతి బ్యాచ్) చదివిన స్నేహితులు బాధితకుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకువచ్చారు. తిరుమలయ్యా పిల్లల చదువు కోసం రూ. 50వేలు ఆర్థికసాయాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో పరశురాం, మొగులయ్య, బసవరాజ్, వెంకట్ రాములు, డీ రాములు, రాంబాబు, సీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

దేవరకద్ర రూరల్: కొకుంట్ల మండల కేంద్రంలో బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా మొదటి రోజు పెద్దమ్మ, కోట మైసమ్మ, కర్రమ్మ దేవతలకు గ్రామంలోని శ్రీశ్రీ చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజాలు చేశారు. అనంతరం మహాగణపతి పూజ, దేవత ఆరాధన, అభిషేకాలను పండితుల పూజాల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ప్రతి ఇంటి నుంచి బిందెలతో నీటిని తీసుకువచ్చి బొడ్రాయికి అభిషేకం చేశారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

మిడ్జిల్: మండల కేంద్రంలో ఈదమ్మ ఆలయం వద్ద బొడ్రాయి ఉత్సవాలలో భాగంగా ఆదివారం వేద పండితుల చేత చండీహోమం నిర్వహించారు. దాదాపు 4గంటల పాటు నిర్వహించిన హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు మదుసూధన్ మూర్తి, వివేక్, ఎంపీటీసీ గౌస్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, గ్రామ పెద్దలు వెంకట్‌రెడ్డి, రాజేశ్వర్, కరుణాకర్, భాస్కర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



చండీహోమంలో పాల్గొన్న భక్తులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, నాటి గురువులు

చిన్నచింతకుంట: అప్పంపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల (1994–95 సంవత్సరంలో పదోతరగతి)పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. నాటి రోజులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ఆనాటి గురువులకు శాలువా పూలదండలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గురువులు వెంకటన్న, బెల్లం సాయులు సిద్దేశ్వర్, నజీర్ హమ్మద్, బత్తుల బాల్‌రాజు, భాస్కర్, వెంకటేష్, విద్యార్థులు నరేష్‌గౌడ్, బాలేష్, జే నరేష్, కావలి అశోక్, రామ కృష్ణారెడ్డి శారద,వెంకటేశ్వరమ్మ, జ్యోతి, భాగ్య, మిత్రవింద దేవి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌దుకాణాలపై దాడులు



రాజాపూర్: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా అధిక ధరలకు మద్యాం విక్రయిస్తుండటంతో పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి బెల్ట్ షాప్‌లపై రాజాపూర్ ఎస్‌ఐ రవి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కాగా మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. మండలంలోని ఏగ్రామంలోనైనా, ఏతండాలో నైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా మద్యం విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని... సమాచారం ఇచ్చిన వారి పేరును గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా కిక్‌బాక్సింగ్ శిక్షణా శిబిరం



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో గత 25 ఏళ్ల నుంచి కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో వేసవిలో ఉచిత కరాటే శిక్షణ అందిస్తుండడం అభినందనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీరోడ్డు స్కూల్ ఆవరణలో ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో.. ఆదివారం నిర్వహించిన కిక్‌బాక్సింగ్ శిక్షణను వినోద్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. కరాటే శిక్షణ పొందేలా చిన్నారులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. కరాటే శిక్షణ తీసుకోవడానికి అవసరమైన స్థలం కేటాయింపు గురించి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. స్థలం విషయమై మున్సిపల్ చైర్మన్ సహకారం తీసుకుందామన్నారు. శిక్షణకు హాజరవుతున్న చిన్నారులకు వచ్చేనెల 5వ తేదీ వరకు అరటిపండ్లు అందజేస్తామని తెలిపారు. అంతకుముందు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అక్రముల్ల హుస్సేని విద్యార్థులకు కిక్‌బాక్సింగ్‌లో ప్రత్యేక శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో కింగ్‌షోటోకాన్ ఫౌండర్ వైస్ చైర్మన్ చెన్న వీరయ్య, కోశాధికారి తిరుపతయ్య, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ తెలంగాణ ఉపాధ్యక్షులు నవీద్ బియబాని, సంయుక్త కార్యదర్శి జహంగీర్‌పాష ఖాద్రీ, కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ మహబూబ్‌నగర్ అధ్యక్షులు కనకంయాదవ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేయాలి

హన్వాడ: ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో.. ప్రజల పక్షాన ప్రజాసమస్యలపై ఉద్యమాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కిల్లెగోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలకేంద్రంలో ఒకరోజు రాజకీయ శిక్షణా తరగతుల కార్యక్రమం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్యకర్తలకు రాజకీయ శిక్షణా తరగతులపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వివిధ రాజకీయ పార్టీలు, సీపీఎం పార్టీ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి లక్ష్మయ్య, రాములు, రమణయ్య, చెన్నయ్య, శ్రీకాంత్, వెం కటమ్మ, అంజమ్మ, అంజయ్య, సహదేవ్, తదతరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కిల్లెగోపాల్

కార్యకర్తలకు అండగా ఉంటాం



బాధిత కుటుంబ సభ్యులతో మాజీ ఎమ్మెల్యే ఆల

అడ్డాకుల: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. పోల్కంపల్లికి చెందిన కార్యకర్త దశరథం కొన్నాళ్ల కిందట ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో పార్టీ బీమా ద్వారా రూ.2లక్షలు మంజూరు కాగా.. సంబంధిత చెక్కును ఆదివారం బాధితకుటుంబానికి అందజేసి మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన రైతు బీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షలను నెల రోజుల లోపే దశరథం భార్య లక్ష్మమ్మ ఖాతాలో జమ అయ్యాయని పేర్కొన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, నర్సిములుగౌడ్, మధు, ఆంజనేయులు, శివరాములు, దాసర్‌పల్లి రాజు తదితరులు ఉన్నారు.

ఇంకా అధికారంలో ఉన్నామనుకుంటున్నారు

అడ్డాకుల: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇంకా తామే అధికారంలో ఉన్నామనుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ మూసాపేట మండలాధ్యక్షుడు శెట్టిశేఖర్ ఆరోపించారు. పోల్కంపల్లికి చెందిన దశరథ ట్రాక్టర్ ప్రమాదంలో మరణిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జనవరి నెలలో రూ. 5లక్షల బీమా నగదును అతడి భార్య ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. కానీ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇంకా తమ ప్రభుత్వమే అధికారంలో ఉందని మతి భ్రమించి మాట్లాడుతున్నారని.. సామాజిక మాధ్యమాల ద్వారా తామే జమచేయించినట్లు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.

ఉత్సాహంగా కిడ్స్ ఫెస్టివల్



సూపర్ కిడ్ విజేత యేబేలును సన్మానిస్తున్న పాస్టర్ పరంజ్యోతి

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని రెమా చర్చ్‌లో పాస్టర్ బీఎస్.పరంజ్యోతి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కిడ్స్ ఫెస్టివల్ ఉత్సాహంగా జరిగింది. ఈ ఏడాదికిను సూపర్ కిడ్‌గా నిలిచిన యేబేలును పరంజ్యోతిని ఘనంగా సత్కరించి కిరిటాన్ని బహుకరించారు. పాస్టర్ పరంజ్యోతి మాట్లాడుతూ చిన్నారులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏడాది వేసవిలో కిడ్స్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన కిడ్స్ ఫెస్టివల్‌లో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200 మంది చిన్నారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రసన్నకుమార్, గోదావరిఖనికి చెందిన సిస్టర్ యూనిస్ బైబిల్‌పై ఆటలు, స్కిట్స్, క్రాఫ్ వర్క్స్, కొరియోగ్రఫీ, సంగీతం లాంటి అంశాలు నిర్వహించినట్లు తెలిపారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చిన్నారిని ఈ ఏడాదికి కిడ్స్ విజేతగా ఎంపిక చేస్తామని, అందులో భాగంగా యేబేలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ ఫెస్టివల్‌లో పాల్గొన్న ప్రతి చిన్నారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కిడ్స్ ఫెస్టివల్ ముగింపు సందర్భంగా చిన్నారులంతా ఆట, పాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్యామ్ కమలాకర్, స్పర్జన్‌రాజు, ఎస్తేరు, మణెమ్మ, బ్లాండీనా తదితరులు పాల్గొన్నారు.

సమయం మార్పు నిర్ణయం హర్షనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రాథమిక, ప్రాథమిక ఉన్నత పాఠశాలల ప్రారంభ సమయాన్ని ఉదయం 9 గంటలకే మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షనీయమని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారూఖ్ హుస్సేన్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా చేసిన ఈ నిర్ణయాన్ని ప్రజాప్రభుత్వం యథాతథంగా మార్పు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఎట్టకేలకు బీటీ పనులకు మోక్షం



సిగ్నల్‌గడ్డ-కొత్త బస్టాండ్ రోడ్డుపై చేపట్టిన బీటీ పనులు

జడ్చర్ల: పపట్టణంలో సిగ్నల్‌గడ్డ మీదుగా 167వ నంబర్ జాతీయరహదారి విస్తరణ పనులకు సంబంధించి కొంత పురోగతి చోటు చేసుకుంది. సిగ్నల్‌గడ్డ మీదుగా దాదాపు రూ.45 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తడకన సాగుతున్న సంగతి తెలిసిందే. రోడ్డు విస్తరణ పనులు చురుగ్గా సాగక పోవడంతో ఈ రహదారిపై ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. అంతేగాక రోడ్డుపై దుమ్ములేస్తుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఓ వైపు బీటీ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ఆదివారం చర్యలు చేపట్టారు. కాగా ఈ బీటీ పనులయినా సవ్యంగా సాగుతాయో లేదో నన్న ఆందోళనను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు కూడా నెలల తరబడి కొనసాగించకుండా త్వరితగతిన బీటీ పనులు పూర్తి చేస్తే రాకపోకల సమయంలో కొంత ఉపశమనం కలిగే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ చిత్తశుద్ధితో పనులను నాణ్యతగా త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతున్నారు. తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఈసందర్భంగా అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.